# 44

## ఒకటికి 15 లక్షలు

ఐదేళ్ళకిందట నాయర్ వయస్సు ఇరవయ్యేళ్ళు. ఆ వయస్సులో అతన్ని మీరెవ్వరూ చూసి ఉండరు. అప్పుడతను త్రివేండ్రంలో ఉండే వాడు. అతని తండ్రి అంతకు ముందెప్పుడో తెలుగు దేశం వచ్చేశాడు. వచ్చి ఏదో హోటల్లో వంటవాడుగా కుదిరాడు. రెండు మూడు మాసాల దాకా నాయర్ కుటుంబానికి తండ్రి నుంచీ ఏ ఉత్తరమూ రాలేదు. నాలుగో మాసంలో 30 రూపాయల మనియార్డరు వచ్చింది. అది లగాయతు, ప్రతినెలా పాతికో, పరకో తండ్రి పంపుతూనే ఉండేవాడు. అన్ని ధరలూ ఆకాశంలోనే ఉండిపోయిన ఈ రోజుల్లో ఈ పాతికతోనూ, పరకతోనూ ఏమవుతుంది గనక!

"ఈ బాధలు పడలేకపోయామండీ! మా అన్నయ్య - బాగా చదువుకొన్నవాడేననుకోండి! కానీ ఉద్యోగాలేవీ చేయడానికి! ఆఖరికి తెగించి దుబాయ్ వెళ్ళిపోయాడు... మీకు తెలియదేమో సార్! మాది పెద్ద సంసారం! ఎంత హీనంగా చూసుకున్నా రోజుకు మూడు కిలోల బియ్యం కావాలి! అందులోకి కూరా, నారా, గుడ్డా, గుడుసూ - ఇక ఆలోచించండి మీరే!" అన్నాడు నాయర్.

అతని పూర్తి పేరు శంకరన్ నాయర్, ఊరివారందరూ, 'శంకు' అని పిలిచేవారట. ఇక్కడికొచ్చాక, పేరులోని తొలిభాగం లుప్తమయి, 'నాయర్' మాత్రం మిగిలిపోయిందిట.

నాయర్ ఈ ప్రాంతానికి రావడం, చాల చిత్రంగా జరిగింది. అన్నతో బాటు తను కూడా మధ్య ప్రాచ్యదేశాలు వెడదామనుకొన్నట్ట. కానీ తల్లీ ఇద్దరు అక్కయ్యలూ వొప్పుకోలేదుట. తను అరబ్ దేశాలకు పోతాడేమోనన్న అనుమానం కొద్దీ, వారు పస్తులుండి, తనకు కడుపునిండా పెడుతూ ఉండేవారుట. ఈ సంగతి తనకు తెలియదని తీరా తెలిశాక చాలా బాధపడ్డాననీ చెప్పుకొచ్చాడు నాయర్.

"మా వాళ్ళను చూడ్డానికి సిగ్గుపడ్డానంటే మీరు నమ్మరు. సిగ్గుపడి, తెగించి ఇక్కడికొచ్చాను. వచ్చేనాటికి నా దగ్గర రూపాయి చిల్లర ఉంది. టీ నీళ్ళు తాగి నాలుగు రోజులు గడిపాను. ఆ తరువాత హోటల్లో చేరాను. అక్కడ మూడు మాసాలపాటు పొట్టకూటికోసం పనిచేశాను. నాకీ ప్రాంతం కొత్త, భాష కొత్త నాభాష ఇక్కడివారికి తెలీదు. నేను స్కూల్ ఫైనల్ పాసయ్యానండి! ఇంగ్లీషు మీడియంలో చదివాను. ఓసారి టీ ఇస్తున్నప్పుడు, ఇద్దరు తెలుగు యువకులు ఇంగ్లీషులో మాట్లాడుకుంటున్నారు. వారి భాషలోని వ్యాకరణ దోషాన్ని సరిదిద్దాను. నిజానికి నేనాపని చేయ కూడదు. కానీ ఆ తప్పును వింటూ భరించలేక అనేశాను"అన్నాడు నాయర్.

అలా చేయడం అతనికి చాలా ఉపయోగపడింది. అందులో ఒకతనికి ఫ్యాన్సీ దుకాణం ఉంది! ఆ దుకాణంలో పనికి కుదిరాడు నాయర్. ఆ దుకాణం వాళ్ళు ఫ్యాన్సీ వస్తువులతో బాటు లాటరీ టిక్కెట్లు కూడా అమ్ముతారు. ఆ టిక్కెట్లను అమ్మేపనిని నాయర్‌కు అప్పగించారు. అంతకు ముందు, కుసుకుసులాడుతున్న లాటరీ టిక్కెట్ల అమ్మకం క్రమంగా పెరగసాగింది.

"నేను చేసింది కూడా ఏమీ లేదండీ! టిక్కెట్లు కొనడం వల్ల వచ్చే లాభాలను ఖాతాదారులకు నచ్చేలాగా చెప్పేవాణ్ని. ఒక వేళ లాభం రాకపోయినా, మీరిచ్చే రూపాయి, ఒక సంక్షేమ కార్యానికి తోడుపడుతుందనే వాణ్ని! మా దగ్గర కొన్నవాళ్ళకు, ఏయే బహుమతులొచ్చాయో చెప్పే వాణ్ని!"

అన్నాడు నాయర్, సన్నగా నవ్వుతూ. "నిజంగా వచ్చాయా- అని అడక్కండి. ఇంతవరకూ రాలేదు. కానీ వచ్చే అవకాశం లేకపోలేదుగదా! నా సరుకును గురించి నా ఖాతాదార్లకు నచ్చచెప్పడం మీదనే నా అమ్మకాలు ఆధారపడి ఉన్నాయి. ఖాతాదార్ల స్వభావాన్ని కనుక్కోవడం తొలి రోజుల్లో చాలా ఇబ్బందిగా ఉండేది. రాను రాను అలవాటయిపోయింది" అన్నాడు నాయర్.

ఇప్పుడతను, మనదేశంలోని అన్ని రాష్ట్రాల టిక్కెట్లూ అమ్ముతున్నాడు- ఒక్క ఆంధ్రప్రదేశ్, గుజరాత్, కాశ్మీర్ రాష్ట్రాలవి తప్ప, ఈ రాష్ట్రాలు లాటరీలను నిర్వహించడం లేదన్నాడు.

యాభయ్ పైసల లాటరీ టిక్కెట్లూ, రూపాయివీ, రెండు రూపాయలవీ అమ్ముతున్నాను. కొన్ని లాటరీలు వారానికొకసారీ, మరికొన్ని 10 రోజులకొకసారి, ఇంకొన్ని 15 రోజులకూ, మిగిలినవి నెలకూ, లాటరీ తీస్తారండీ! లాటరీ తీయడానికి, ఒకటి రెండు రోజులు ముందుగా అమ్మకాలు బాగా ఉంటాయి. నెలలో మొదటి వారమంతా అమ్మకాలు, మరీ జాస్తీగా ఉంటాయండి అన్నాడు నాయర్.

ఈ లాటరీ టిక్కెట్లను, స్టాకిస్టుల దగ్గరనుంచి తనే తెస్తుంటానన్నాడు. ఒక్కో రాష్ట్రం, ఒక్కో విధంగా కమీషన్ ఇస్తూ ఉంటుందనీ, ఈ డిస్కౌంటు 10 శాతం నుండి 25 శాతం దాకా ఉంటుందని అన్నాడు.

"ఒక లాటరీ టిక్కెట్టు రూపాయి ఉన్నదనుకోండి. ఆ టిక్కెట్టు మీద మాకు 25 శాతం కమిషను ఇస్తే, మేము 10 టిక్కెట్లు కొన్నవారికి వొకదాన్ని ఫ్రీగా ఇస్తాం. అదే - 10 శాతం కమిషను ఇచ్చే రాష్ట్రం ఉన్నదనుకోండి - 20 టిక్కెట్లు కొంటే, ఒక్క టిక్కెట్టు మాత్రమే ఇస్తాం. మాకు కమిషను ఎక్కువగా ఇచ్చే రాష్ట్రాల లాటరీ టిక్కెట్లను, చిన్న చిన్న అమ్మకందార్లకు, కొద్దిగా మార్జిన్ చూసుకొని అమ్మేస్తాం" అన్నాడు నాయర్.

తాము స్టాకిస్టుల నుండి తెచ్చుకొన్న టిక్కెట్లు, అమ్ముడుపోకపోతే, ఆ నష్టాన్ని తామే భరిస్తామనీ, అందుకనే కమిషను కాస్త తగ్గినా, టిక్కెట్లు తమ దగ్గర నిలవ ఉండకుండా చూసుకొంటామనీ నాయర్ చెప్పాడు.

"ఇప్పుడు నేను నెలకు 10, 12 వే లరూపాయల టిక్కెట్లు అమ్ముతున్నానండీ! మహా అయితే, మూడు వందల రూపాయల టిక్కెట్లు మిగిలిపోతాయి. ఒకప్పుడు నాకు జీతం ఇచ్చేవారు. ఇప్పుడు జీతం కాక అమ్మకాల మీద 1 శాతం కమిషను కూడా ఇస్తున్నారు. జీతం, నా తిండికి బట్టకూ సరిపోతుంది! కమిషను మా ఇంటికి పంపుతానండీ"అన్నాడు నాయర్.

ఉదయమే, తనే వండుకొని, టిఫిన్ కారియర్‌లో తెచ్చుకుంటాట్ట. షాపు మూసిందాకా అమ్ముకొని యజమానికి లెక్క అప్పగించి, రాత్రి ఏ పదిగంటలకో సైకిల్ మీద గదికి చేరుకొంటాట్ట.

హఠాత్తుగా లక్షలు సంపాదించాలన్న ఆశ జనంలో ఉన్నంత కాలం, తన వ్యాపారానికి డోకాలేదంటున్న నాయర్ తనకోసమని ఒక్క టిక్కెట్టు కొనుక్కోలేదు.

"ఉట్రవుడియంగా, లక్షలు సంపాదించాలని నాకు లేదండి" అన్నాడు నాయర్ పకపక నవ్వుతూ. "నా ముఖం చూస్తే- నిజం చెప్పండి సార్! నాది లాటరీలో లక్షలొచ్చే ముఖమేనా! అలాంటివాటి మీద నాకు ఆశలేదు నమ్మకం అంతకన్నాలేదు".

ఇలా అంటున్న పాతికేళ్ళ శంకరన్ నాయర్ నుంచి మనం నేర్చుకోవలసింది ఏదీ లేదా?